యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

62 బస్తాల దిగుబడి సాధించిన ఎస్.చిక్కాల రైతు

పాలకొల్లు అర్బన్: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలకు చెందిన తాళ్లూరి శ్రీనివాస్ అనే ఆదర్శ రైతు ప్రయోగాత్మకంగా నిరూపించారు. శ్రీనివాస్ గ్రామంలో 50 ఎకరాలు కౌలుకి సాగు చేస్తుంటారు. అతనికి సొంతంగా రెండున్నర ఎకరాలు సొంత భూమి ఉంది. రాపాక ఛానెల్‌కి శివారున ఉన్న ఈ వ్యవసాయ భూముల్లో ఈ ఏడాది దాళ్వా సాగులో ఎంటీయూ–1156 వరి వంగడాన్ని 15 ఎకరాల భూమిలో సాగుచేశారు. ఎకరానికి 62 బస్తాల దిగుబడి రాగా మరో 12 ఎకరాల్లో 60 బస్తాల దిగుబడి వచ్చింది. పాలకొల్లు మండలంలో 27 గ్రామాల్లో దాళ్వా పంట సరాసరి దిగుబడి ఎకరానికి 47 బస్తాలు దిగుబడి వచ్చింది.

రాపాక ఛానెల్ శివారు భూముల్లో

రాపాక చానెల్ శివారున శివదేవునిచిక్కాల, తిల్లపూడి గ్రామాలు ఉన్నాయి. ఈ భూములకు ప్రతీ ఏటా దాళ్వా పంటలో సాగునీటి ఎద్దడి ఎదురవుతుంది. అయితే ఈ ఏడాది నీటిపారుదల శాఖ అధికారులు వంతుల విధానం అమలు చేసి సాగు నీరు సక్రమంగా అందించారు. అలాగే చివరి రెండు తడుల కోసం తిల్లపూడి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు సరఫరా అయ్యింది.



పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో రైతు శ్రీనివాస్ పంట చేనుని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త శివదేవునిచిక్కాలలో రైతు శ్రీనివాస్ పంట చేను ఈనిక దశలో దృశ్యం →



జిల్లా కలెక్టర్ చొరవతో....

ఈ ఏడాది శివదేవునిచిక్కాల వద్ద ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సుమారు రూ.3 లక్షల వ్యయం చేసి ఏర్పాటు చేశారు. దీంట్లో రూ.లక్ష రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు అందజేశారు. ప్రభుత్వం రూ.లక్ష అందజేయడంతో రైతులు మరో రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. దీంతో 500 ఎకరాలకు దాళ్వా పంటలో చివరి రెండు తడులకు సాగునీరు సక్రమంగా అందింది.

యాజమాన్య పద్ధతులు పాటించాను



పంట చేనుకి సాగునీరు సక్రమంగా అందించా. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి పంట చేనుకి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు సమపాళ్లలో అందించాను. దమ్ములో ఒకసారి, దుబ్బు సమయంలోనూ, అలాగే చిరుపొట్ట దశలో ఎరువులు అందించా. అన్నిటికన్నా దాళ్వా సాగు నిర్ణీత సమయం (డిసెంబర్ 31) లోగా నాట్లు పూర్తి చేశాను. దీంతో ఎకరానికి 62 బస్తాల దిగుబడి వచ్చింది.

– తాళ్లూరి శ్రీనివాస్, కౌలు రైతు, శివదేవునిచిక్కాల

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ నెల 29న మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సంబంధిత మండల శాఖ అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

ఖరీఫ్ పంటకు గుంపర్రు రైతులు సన్నద్ధం

యలమంచిలి: జూన్ మొదటి వారంలోనే ఖరీఫ్ పంటకు నారుమడులు వేయాలని గుంపర్రు రైతులు నిర్ణయించుకున్నారు. స్థానిక శివాలయంలో శనివారం సమావేశమైన రైతు సంఘ నాయకులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అప్పటికి విత్తనాలు అందేలా చూడాలని వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డిని వారంతా కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు కొలుకులూరి రామకృష్ణ, జడ్డు బదరీ నారాయణ, గణపాబత్తుల ఏసుబాబు, కుక్కల సత్యనారాయణ, పల్లి రంగారావు, పల్లి జార్జిబాబు, బొక్కా ప్రసాద్, భీమాల రాంబాబు, కె.పద్మనాభం, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సార్వా పంటపై రైతులకు అవగాహన



కొత్తోటలో ఆర్‌బీకే సిబ్బందితో సమావేశమైన వ్యవసాయాధికారి రహీమ్

మొగల్తూరు: సార్వా పంటకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదేశించారు. మండలంలోని కొత్తోట రైతు భరోసా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్‌బీకే సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. దాళ్వా మాసూళ్ళు పూర్తయిన చేలల్లో భూసార పరీక్షలు నిర్వహించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. నాట్లు వేసిన వెంటనే ఈక్రాప్ నమోదు చేయాలని, ఈ క్రాప్ వలన కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీదే విజయం



కొవ్వూరి వేణుమాధవ రెడ్డి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, అఖండ విజయం సాధించడం ఖాయమని ఏపీ విద్య మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ డైరెక్టరు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణు మాధవ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు విశ్వసనీయతకే పట్టం కట్టబోతున్నారని, ప్రజలకు మంచి చేసిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన కూటమి దుష్ప్రచారం, కుయుక్తులపైనే నమ్మకం పెట్టుకుందని మండిపడ్డారు.

రేపటి నుంచి దేశాలమ్మవారి జాతర



ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో లాకు దిగువ చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుండి ప్రారంభంకానున్నాయి. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణలతో బారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు సోమవారం నుంచి జూన్ 2 ఆదివారం వరకూ ఏడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి పానకం కావిడి, నైవేద్యం సమర్పించిన అనంతరం జాతర ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం మజ్జి దుర్గా సత్యేంద్ర, లక్ష్మీ దంపతుల ద్వారా లక్ష మల్లెల పూజ చేయనున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షులు శిడగం రామలింగేశ్వరరావు, అధ్యక్షులు వలిరెడ్డి వరహాలరావు, ప్రధాన కార్యదర్శి శిడగం చంద్రశేఖర్, కోశాధికారి వలిరెడ్డి పెద్దిరాజు, మునకాల అఖిల్ కృష్ణ సాయిరామ్, పెద్ది వీరవెంకట సత్యనారాయణ, వలిరెడ్డి ఏసుబాబు, వండాని మణికంఠ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

యలమంచిలి: చించినాడ బస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలకు గాయాలైనట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. యలమంచిలి కొత్త కాలనీకి చెందిన కొల్లు మంగ, ఆమె చెల్లిలి కూతురు శ్రీపూజిత బస్టాండ్ వద్ద నుంచుని ఉండగా దిగమర్రు వైపు రాజోలు వైపు వెళ్తున్న పల్సర్ బండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరికీ వైద్యం చేయగా శ్రీపూజితకు సీరియస్ కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తీసుకెళ్లారు. ఈ మేరకు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు.

నేడు దండు గంగాలమ్మ అమ్మవారి జాతర

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉన్న శ్రీ దండు గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, పెన్నాడ ఎఫ్‌సీఐ సభ్యులు, సివిల్ సప్లై జట్టు సభ్యులు, ధర్మకర్త గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం అమ్మవారి దర్శనం, చలివిడి పానకాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం సాయంత్రం జాతర మహోత్సవం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద తోట సీతయ్య కుమారుల సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని వివరించారు.

వేలం పాట రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని గునుపూడిలో ఉన్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానానికి చెందిన య.87–71సెంట్లు వ్యవసాయ భూమి కి 2024–2025 నుంచి 2026–2027 వరకు టెండర్–కమ్–బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంపాటదారుల ఆసక్తి చూపని కారణంగా వేలం పాట నిలుపుదల చేశారు.

జైలులో ఖైదీలకు సరైన సౌకర్యాలుండాలి



ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

నరసాపురం: జైలులో ఖైదీలకు నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు సబ్‌జైలు అధికారులను ఆదేశించారు. శనివారం జడ్జి శ్రీనివాసరావు నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి పరిశీలించారు. సబ్‌జైలులో టాయిలెట్స్, మంచినీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. రిమాండ్ ఖైదీల్లో ఎవరైనా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండి, బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోలేకపోతే ఫిర్యాదు చేయాలన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెయిల్‌పై బయటకు వెళ్లిన రిమాండ్ ఖైదీలు కోర్టు వాయిదాలకు సక్రమంగా రాకపోతే కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, న్యాయవాదులు శిరీష, చాముండేశ్వరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాళీపట్నం తూర్పులో కార్డెన్ అండ్ సెర్చ్



కాళీపట్నం తూర్పులో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

మొగల్తూరు: గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలుంటే తమకు సమాచారం అందించాలని నరసాపురం సీఐ కె గోవిందరాజు కోరారు. కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లా ఎస్పీ అజిత ఆదేశాల మేరకు శనివారం మండంలోని కాళీపట్నం తూర్పు గ్రామంలో నరసాపురం, మొగల్తూరు పోలీసులతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరించినా, మద్యం, సారా అక్రమ నిల్వలున్నా , పెట్రోల్, మందుగుండు సామాగ్రి నిల్వ చేసినా తమకు సమాచారం అందించాలని మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ సూచించారు. గ్రామంలోని వాహనదారులు తమ వాహనాలకు సంబందించి సరైన పత్రాలుండాలని లేని పక్షంలో అటువంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తగిన కారణాలు లేకుండా గ్రామంలో ఉండకూడదన్నారు. ఎన్నికల లెక్కింపు రోజును ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, అసాంఘిక సంఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసాపురం రూరల్ ఎస్సై గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం



మొగల్తూరులోని స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను దిగుమతి చేసుకుంటున్న సిబ్బంది

మొగల్తూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. పాఠశాలల తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యా శాఖాధికారులు ఇండెంట్‌లు అందించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికే పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగానే మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 46,150 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా మొదటి విడతలో 17072 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ శామ్యూల్ జాన్ శనవారం తెలిపారు. వచ్చిన పుస్తకాలను మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఉంచామన్నారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలో రానున్నాయని, పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ముందుగానే ఆయా పాఠశాలలోని విద్యార్థులకు అందజేస్తామని స్పష్టం చేశారు.

పిల్లల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

నరసాపురం: పిల్లల పెంపకంలో తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా కోర్టు వద్ద డ్వాక్రా మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నరసాపురం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్జి గంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలతో బయటకు వెళ్లినప్పుడు వారిని తప్పిపోకుండా చూసుకోవాలన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఎవరైనా పిల్లలు అనుమానాస్పందంగా కనిపిస్తే పోలీసులకు, అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు, కార్యదర్శి ఆర్‌జీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు



గేదెలకు వ్యాక్సిన్ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

యలమంచిలి: కనకాయలంక, బాడవ గ్రామాలలో శనివారం పశువులకు దొమ్మ (గొంతు వాపు) వ్యాధి రాకుండా వ్యాక్సిన్స్ వేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. కనకాయలంక గ్రామంలో 80 పశువులకు, బాడవ గ్రామంలో 70 పశువులకు పశు వైద్య సిబ్బంది వ్యాక్సిన్ చేసినట్లు ఆయన వివరించారు. వేసవి ఎండలు తగ్గాక వర్షాలు మొదలయ్యే సమయంలో మొలిచే చిగురు గడ్డి తినడం వలన పశువులకు ఈ వ్యాధి వస్తుందని ఆయన చెప్పారు. ఈ వ్యాధి వచ్చిన పశువులకు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి పశువు గొంతు వాపు వస్తుందన్నారు. ఈ లక్షణాలు కనిపించిన ఐదారు గంటలకే పశువు మరణించే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఈ వ్యాధి వచ్చిన తరువాత పశువుకు వైద్యం చేయించడం కన్నా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిదన్నారు. ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రాల వద్ద పశు వైద్య సహాయకులు ఈ వ్యాక్సిన్ చేస్తారని ఆయన వివరించారు. రైతులంతా తమ పశువులకు సంబంధిత గ్రామాల రైతు భరోసా కేంద్రాల వద్దకు తోలుకెళ్లి ఈ వ్యాక్సిన్ చేయించుకోవాలని డాక్టర్ చంద్రశేఖరరెడ్డి కోరారు.

వాసవీ మాత సేవలో ఆర్‌జేసీ



పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ ఆలయంలో ఆర్‌జేసీ సుబ్బారావు దంపతులు



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న బెంగుళూరు భక్తులు

పెనుగొండ: దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కేవీ సుబ్బారావు దంపతులు పెనుగొండ ప్రసిద్ధ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాన్ని దర్శించుకున్నారు. శనివారం ఆర్‌జేసీ సుబ్బారావుకు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నూలి తాతాజీ, ట్రస్టీలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీనగరేశ్వర స్వామికి అభిషేకంలు, మహిషాసురమర్ధనీ, వాసవీ మాతలకు పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆర్‌జేసీ దంపతులకు వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

వాసవీ శాంతి ధాంలో వాసవీ హోమం

అఖిల భారత పెనుగొండ శ్రీ వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో బెంగుళూరుకు చెందిన భక్తులు వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం 102 రుషీ గోత్ర మందిరం వద్ద తొలుత గోపూజ నిర్వహించారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ పర్యవేక్షణలో అర్చకుడు శిష్టా మణికంఠ అభిషేకాలు నిర్వహించారు. పూజలు, అర్చనలు అనంతరం వాసవీ హోమం నిర్వహించారు. వాసవీ హోమంలో పూర్ణాహుతి సమర్పించి 102 రుషీ గోత్ర మందిరంలో వాసవీ పురాణం పఠనం చేశారు. బెంగుళూరు నుంచి 200 మందికి పైగా భక్తులు తరలిరావడంతో వాసవీ శాంతి ధాం కిటకిటలాడింది.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



వేసవి విజ్ఞాన తరగతుల్లో కరాటే శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో గేమ్స్ ఆడుకుంటున్న విద్యార్థులు

నరసాపురం: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. ప్రతిరోజూ విద్యార్థులు పెద్దసంఖ్యలో శిబిరానికి హాజరవుతున్నారు. శనివారం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో పిల్లలకు నీతికథలు చెప్పారు. అలాగే పిల్లలతో అనుభవజ్ఞులైన తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, చెస్ వంటి ఆటలు నేర్పించారు. యోగా తరగతులు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణ శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి తెలిపారు. ఈ నెల 15 వ తేదీన ఈ సమ్మర్ క్యాంపు ప్రారంభించామన్నారు. జూన్ 7 వరకూ నిర్వహించే ఈ సమ్మర్ క్యాంపులో నీతి కథలు, బొమ్మలు తయారు చేయడం, యోగ, మ్యాథ్స్, క్యారమ్స్, చెస్, లూడో వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇలాంటి క్రీడలు, విలువలతో కూడిన విద్య వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో చిన్నతనం నుండే క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీవీ సత్యనారాయణ, ఎస్.మహారాజ్, ఉపాధ్యాయులు వి.వెంకట్రావు, కె.సూర్యకుమార్, సీహెచ్ సీతారామ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. శనివారం లయన్స్ జిల్లా గవర్నర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ జిల్లాలో లయన్స్ అందించే సేవలు అభినందనీయమని అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ ఏర్పాటుచేసిన గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం చాలా గొప్ప విషయమని అన్నారు. అనంతరం టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లను అందించారు. అంజలి పాఠశాల, లయన్స్ పాఠశాల, లయన్స్ బస్ షెల్టర్, రాజవల్లి రాధారమణ లయన్స్ ఆసుపత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్.అన్నపూర్ణ, సెక్రటరీ మాగం నారాయణరావు, ట్రెజరర్ డి.సత్యనారాయణ ప్రసాద్, సభ్యులు నిమ్మల పాపారావునాయుడు, రేపాక ప్రవీణ్‌భాను, కొమ్ముల మురళీ, ముచ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన



కేపీ పాలెంలో వీస్తున్న ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో శుక్రవారం సాయంత్రం నుంచి ఈదురుగాలులు, కొద్దిపాటి వర్షం పడుతుంది. శనివారం ఉదయం నుండి ఆకాశం మేఘావృత్తమై ఉండటంతో పాటు చిరుగాలులు వీస్తున్నాయి. వాయుగుండం తుఫాన్‌గా మారడంతో రానున్న రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆలస్యంగా ఊడ్చిన చేలల్లో వరి కోతలు కోయకపోవడంతో పాటుకోసిన ధాన్యం గత రెండు రోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షానికి తడిపిపోయాయి. మరో వారం రోజులు పాటు వర్షాలు కురుకవకుండా వరుణుడు కాపాడితే పంట నష్టం నుండి గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.

మత్స్యకారులు సముద్రపు వేటకు వెళ్లవద్దు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా రానున్న రెండు రోజులు పాటు మత్స్యకారులు సముద్రవేటకు వెళ్లవద్దని తహసీల్దార్ భాస్కర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే సందర్శకులు సముద్ర స్నానం చేయడానికి లోపలకు వెళ్లరాదని, తగిన జాగ్రత్తలు తీసుకుని సముద్ర స్నానం చేయాలని సూచించారు.

ముగిసిన అతిరాత్ర మహాయాగం

భీమవరం (ప్రకాశంచౌక్): డీఎన్నార్ కళాశాల, గన్నాబత్తుల వారి క్రీడా మైదానంలో శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్(నెలమూరు) వారి ఆధ్వర్యంలో గత 11 రోజులుగా జరుగుతున్న అతిరాత్ర మహాయాగం శనివారం. ముగిసింది. సుమారు పదిహేను వేల మంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆరు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ముగింపు వేడుకల్లో మహాపూర్ణాహుతి, పుత్రకామిష్టి యాగం వైభవంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 96 మంది మహా రుత్వికులను, 42 మంది వేదపండితులను ఘనంగా సత్కరించారు. యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ 11 రోజులపాటు యజ్ఞం, యాగం నిర్వహించామన్నారు. ముందుగా గూడూరి ఉమాబాల, పీవీఎల్ నరసింహరాజు, ఉద్దరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, గన్నాబత్తుల శ్రీనివాస్, గజల్ శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ముగింపు వేడుకల ప్రారంభించారు. అనంతరం యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మను ఘనంగా సత్కరించారు.